
సాక్షి
గుంటూరు
గురువారం । 11 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.90 అడుగుల వద్ద ఉంది. ఇది 152.7628 టీఎంసీలకు సమానం.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.



మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 84.63 శాతం హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై బుధవారం నిర్వహించిన పాలిసెట్-2023 సజావుగా జరిగింది. గుంటూరు నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 5,409 మంది విద్యార్థులకు గాను 4,578 మంది హాజరయ్యారు. 84.63 శాతం హాజరు నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగ్గా, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద విద్యార్థులకు తనిఖీలు నిర్వహించారు. హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్ మినహా ఇతర ఎటువంటి సామగ్రిని కేంద్రాల్లోనికి అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాలిసెట్-2023 గుంటూరు జిల్లా సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, సివిల్ దావాలు, బ్యాంకు, రెవెన్యూ, బీమా, భూ సేకరణ, వివాహ సంబంధిత, మోటారు ప్రమాదాలు, ఎలక్ట్రిసిటీ, ప్రీలిటిగేషన్ తదితర కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌తో అమూల్యమైన సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు.

యార్డులో 88,049 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 81,023 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,178 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో భాగంగా ఫిబ్రవరి 4న నిర్వహించిన సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలపై చర్చించి, ఆమోదిస్తామని తెలిపారు. కాగా మూడు జిల్లాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కానున్నారని తెలిపారు.

ఆరోగ్యమిత్రల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు మెడికల్: ఆరోగ్య మిత్ర ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసినట్లు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనవారి జాబితాను గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో guntur.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

చదరంగ శిక్షణ.. విశేష ఆదరణ

'సాక్షి' ఉచిత చెస్ శిక్షణకు అద్భుత స్పందన

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు.. యువత
- మెలకువలు నేర్చుకున్నామన్న క్రీడాకారులు



చదరంగంలో శిక్షణ పొంది 'సాక్షి' అందజేసిన సర్టిఫికెట్లను చూపుతున్న చిన్నారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ చిటికెలో అపజయం నుంచి విజయం వైపు కదిలే మేధావుల క్రీడ చదరంగం. ప్రపంచవ్యాప్తంగా రష్యా తర్వాత అత్యధిక సంఖ్యలో గ్రాండ్ మాస్టర్స్ (81 మంది గ్రాండ్ మాస్టర్స్) కలిగిన దేశంగా ఇండియా ప్రసిద్ధి చెందింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చెస్ టోర్నీలు జరిగినా అక్కడ మనవారు పాల్గొని సత్తా చాటుతుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన క్రీడలో యువతకు శిక్షణనిచ్చేందుకు సామాజిక బాధ్యతలో భాగంగా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మాస్టర్‌మైండ్స్ సౌజన్యంతో బుధవారం స్థానిక బ్రాడీపేటలో నిర్వహించిన ఉచిత చెస్ శిక్షణకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ ఉమెన్ మాస్టర్స్‌ను తీర్చిదిద్దిన సీనియర్ జాతీయ కోచ్ సీహెచ్ రవీంద్ర రాజు, షేక్ అబ్దుల్ నబీలు చిన్నారులకు శిక్షణతోపాటు చెస్ నిబంధనలు, గేమ్ డీసెన్సీపై సలహాలనిచ్చారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ డి.రమేష్ బాబు, మాస్టర్‌మైండ్స్ ప్రిన్సిపాల్ అంజనీ కుమార్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, వలి, అంజిబాబు పాల్గొన్నారు.

విలువైన సూచనలు ఇచ్చారు



నా బిడ్డతో పాటు నేను కూడా చెస్ నేర్చుకుంటున్నాను. సాక్షి మీడియా ప్రత్యేకత మాకు తెలుసు. అందుకే ఇద్దరం శిక్షణలో పాల్గొన్నాం. రెగ్యులర్‌గా కోచ్‌లు చెప్పేదానికంటే భిన్నంగా ఉంది. విలువైన సూచనలు, గేమ్ ట్రిక్స్ చెప్పారు. ప్రతి పాయింట్ విలువైనదే.

– ఎం.గోపీకృష్ణ, తారా శ్రీసాయి (తండ్రి, కుమార్తె), కొల్లూరు

లోపాలను తొలిసారి తెలుసుకుంటున్నాం



మా బాబుకి శిక్షణనిప్పిస్తున్నాం. కొంత వరకు నేర్చుకుంటున్నాడు. అయితే ఆడేటప్పుడు తప్పులను, లోపాలను ఎలా సరిదిద్దుకోవాలో తొలిసారి విన్నాం.దీంతోపాటు జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ మాకు లాభించింది. ఇదొక కొత్త ఒరవడి. మిగతా మీడియా కూడా ఇటువంటివి చేస్తే మరింత బాగుంటుంది. 'సాక్షి'కి ప్రత్యేక ధన్యవాదాలు.

– సీహెచ్ జ్యోత్స్న, కారుణ్య(తల్లి- కుమారుడు) మంగళగిరి

చిట్కాలు తెలుసుకుంటే...



చెస్ శిక్షణనిచ్చిన జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు, జాతీయ శిక్షకుడు సీహెచ్ రవీంద్ర రాజు మాట్లాడుతూ మేధావుల క్రీడగా విరాజిల్లుతూ భారత దేశంలో పుట్టిన చదరంగంకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ క్రీడ నేర్చుకునేందుకు ఔత్సాహికులు గంటల్లో నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అటువంటి కార్యక్రమాన్ని ఉచితంగా ఏర్పాటు చేసి చిన్నారులకు అందించడం గొప్ప విషయమన్నారు. విజయాలు సాధించాలంటే ముందుగా లోపాలను సరిచేసుకోవాలని, చిన్న చిన్న చిట్కాలతో గొప్ప గొప్ప మ్యాచ్‌లు గెలిచిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు.

నిబంధనలు, డీసెన్సీ అవసరమే



చెస్ శిక్షకుడు టాలెంట్ చెస్ అకాడమీ చీఫ్ కోచ్ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ నేర్చుకునే ప్రతి వారు ఏదో ఒక టోర్నమెంట్ ఆడతారన్నారు. చాలా హుందాగా సాగే ఈ క్రీడలో నిబంధనలు తెలుసుకోవడంతోపాటు గేమ్ డీసెన్సీ చాలా ముఖ్యమన్నారు. దీంతోపాటు మ్యాచ్ ఆడే సమయంలో చూపే ఏకాగ్రత కూడా విజయాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. ఉచిత శిక్షణ, సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ల ద్వారా ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణిస్తున్నారని చెప్పారు. చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

చిన్నారులకు గొప్ప ప్రోత్సాహం



ప్రస్తుతం పిల్లలకు వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. ఇటువంటి సమయంలో చెస్ శిక్షణ నిర్వహించడం బాగుంది. నేను వ్యక్తిగతంగా టీచర్‌ను. క్రీడలకు ఉన్న ప్రాధాన్యత తెలుసు. సాక్షి మీడియా అద్భుతంగా తక్కువ సమయంలో ఎక్కువ లాభం చేకూర్చే విధంగా శిక్షణ ఇప్పిచ్చింది. నేను కూడా పాపతో సహా పాల్గొన్నాను. ఇటువంటివి మరిన్ని నిర్వహించాలని మనవి.

– షేక్ రెహానా బేగం, భానో (తల్లి – కుమార్తె), గుంటూరు

ఈ శిక్షణ కొనసాగిస్తాం



మా ఇద్దరికీ చెస్ అంటే చాలా ఇష్టం. నాన్న కూడా మమ్మల్ని బాగా ప్రోత్సహిస్తారు. ఈ శిక్షణలో చాలా విషయాలు నేర్చుకున్నాం. తర్వాత తప్పక వేసవి శిక్షణ శిబిరాలకు వెళ్లి నేర్చుకుంటాం. పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం చాలా ప్రోత్సాహంగా ఉంది.

– సుహానా-సాదిఖా (అక్కాచెల్లెళ్లు) గుంటూరు

సాక్షి మీడియా ప్రయత్నం గొప్పది



మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్ఎంఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సాక్షి మీడియా చేస్తున్న ఈ ప్రయత్నం గొప్పదన్నారు. ఈ ప్రయత్నం క్రీడాభివృద్ధికి దోహదపడడంతోపాటు ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. వ్యాపార సంస్థలు సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రతిభ ఉండీ అవకాశాలు రానివాళ్లకు సహకారమందించాల్సిన బాధ్యత ఉందన్నారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందాన్నిచ్చిందన్నారు.

నేటి నుంచి దీక్షల విరమణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠం దీక్షల విరమణకు సిద్ధమైంది. మూడు రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులతో దీక్షా పీఠంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది. మంగళవారం నుంచి సుందరకాండ పారాయణం, మన్యుసూక్త మూలమంత్ర హోమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం సుందరకాండ పారాయణం పూర్తి కాగా గురువారం నుంచి దీక్ష విరమణలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. గురువారం నుంచి 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 13వ తేదీ శనివారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ జరుగుతుంది. తొలుత పీఠం నుంచి దీక్షాదారులు పవిత్ర కృష్ణానదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కలశాలతో నదీ జలాలను తీసుకుని తిరిగి పీఠానికి చేరుకుని స్వామి వారిని అభిషేకిస్తారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా దీక్ష విరమణలు చేస్తారు. 14వ తేదీ హనుమత్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తారు. 15వ తేదీ సోమవారం మహా పూర్ణాహుతితో దీక్షలు, ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. పీఠం ఆవరణలోని యాగశాలలో దీక్ష విరమణల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు క్యూలైన్లతో పాటు ఆలయం వెలుపల చలువ పందిళ్లు సిద్ధం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చే భక్తుల కోసం దేవస్థానంలో ఉచిత అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సమస్యలకు మెరుగైన పరిష్కారం

- 24 గంటలు అందుబాటులో హెల్ప్‌లైన్
- ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు..
- 'జగనన్నకు చెబుదాం'పై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



సమావేశంలో కలెక్టర్, జేసీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం అందించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ప్రజలు ఇంటి నుంచే వారి సమస్యలను 24/7 హెల్ప్‌లైన్‌కు తెలపవచ్చన్నారు. ప్రజలు తెలిపిన సమస్యకు యువర్ సర్వీస్ రిక్వెస్ట్ (వైఎస్ఆర్) నెంబరు, లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ ఫోన్‌కు వస్తుందన్నారు. దీని ద్వారా సమస్య పరిష్కారానికి సంబంధించి వివిధ దశలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసి ప్రజలు తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు జరుగుతున్న స్పందన కార్యక్రమంలో తీసుకుంటున్న అర్జీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానం చేసి మరింత మెరుగ్గా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతున్న స్పందన కార్యక్రమంలోను, ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో జరుగుతున్న స్పందనలో ప్రజలు అందించిన వినతులు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా వచ్చిన వినతులు అన్నింటిని సక్రమంగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. సమస్యలను మరింత మెరుగ్గా పరిష్కరించటానికి ప్రాసెస్ రీ-ఇంజినీరింగ్ ద్వారా సమస్యలు ఎక్కువగా వస్తున్న శాఖలకు సంబంధించి కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, పరిష్కారాలను సులభతరం చేస్తామన్నారు. ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్స్ (పీఎంయూ)ను రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పీఎంయూలో నియమించిన అధికారులందరూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారికి ఫార్వర్డ్ చేసి వాటిని సక్రమంగా పరిష్కరించేలా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. పరిష్కరించిన వినతిపై ప్రజల నుంచి పరిష్కరించిన విధానంపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని కారణాలను విశ్లేషించటం జరుగుతుందన్నారు. అదేవిధంగా సిటిజన్ రిలేషన్‌షిప్‌లో భాగంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందించిన వినతులను పరిష్కరిస్తున్న విధానంపై నూతన సాంకేతిక పద్ధతులు ద్వారా ఎప్పటికప్పుడు తెలియచేసి, ప్రభుత్వ యంత్రాంగంతో ప్రజలకు సమన్వయం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి పేరును ఈ కార్యక్రమానికి పెట్టడం ద్వారా జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయంలోని ఉద్యోగి వరకు ప్రజలు అందించిన ఫిర్యాదులను ముఖ్యమంత్రికి పంపించినట్లుగా భావించి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి మరింత మెరుగ్గా పరిష్కారించే ప్రయత్నం చేస్తారన్నారు. జిల్లాలో వస్తున్న ఫిర్యాదులను విశ్లేషించగా, ఎక్కువగా మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ రాజ్, పోలీస్, విద్యుత్ శాఖ తదితర శాఖల నుంచి వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న శాఖల ముఖ్య అధికారులను పీఎంయూలలో నియమిస్తున్నట్లు తెలిపారు. వీరు ప్రజల నుంచి వచ్చిన సమస్యలు సక్రమంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు సరియైన పరిష్కారం ఇవ్వలేకపోతున్న సమస్యలకు కారణాలను విశ్లేషించి దానికి సంబంధించి తీసుకోవాల్సిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారన్నారు. ఇప్పటి వరకు స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రతి సోమవారం, బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించటం జరుగుతుందని, అయితే ఇప్పటి నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల అర్జీల పరిష్కారంపై ప్రతిరోజు గంటసేపు జాయింట్ కలెక్టర్‌తో కలసి సమీక్షించి, నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఉన్న పీఎంయూలు సమస్యలకు సరియైన పరిష్కారం ఇవ్వటానికి ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించటం జరిగిందన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి విడదల రజిని

- జగనన్న పాలనలో విద్య, వైద్యం, గృహాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి రజిని ఇంటింటికి తిరుగుతూ ఏ కుటుంబానికి ప్రభుత్వ పథకాలతో ఎంత మేలు జరిగిందో వివరించారు. ఆమె మాట్లాడుతూ పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంట్లోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిష్ మీడి యం విద్య, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16వేల కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల వరకు పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు.

మెప్మా సిబ్బంది చేతివాటం

- తప్పుడు ధ్రువ పత్రాలతో రూ.1.05కోట్ల రుణం
- యూనియన్ బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టిన సీఎంఎం, ఆర్పీలు
- మేనేజర్‌ను తప్పుదోవ పట్టించి రుణం తీసుకున్న వైనం



యూనియన్ బ్యాంక్, ఆటోనగర్ బ్రాంచ్

నెహ్రూనగర్: మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అక్రమాలకు అడ్డాగా మారింది. మెప్మా సిబ్బంది ఆగడాలు రోజు రోజుకి పెచ్చుమీరుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె పరిధిలో ఆర్పీలు కుమ్మక్కై కోటి న్నర రూపాయలు బ్యాంకుకు టోకరా వేసిన విషయం మరువకముందే తాజాగా గుంటూరు నగరంలో యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను మోసం చేసి రూ.కోటికి పైగా ఎసరు పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. తీరా లోన్ రికవరీ చేయకపోవడంతో బ్యాంకు మేనేజర్ లోతుగా పరిశీలించగా ఆర్పీలు, సీఎంఎంలు(సిటీ మిషన్ మేనేజర్) కుమ్మక్కై మోసం చేశారని గుర్తించి లబోదిబో మంటూ మెప్మా పీడీ వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారు.

తప్పుడు ధ్రువ పత్రాలతో బురిడీ..

గుంటూరు నగరంలో ఒక బ్యాంకులో లోన్ తీసుకున్నప్పటికీ మహిళల నిరక్ష్యరాస్యతను ఆసరాగా చేసుకుని వారి పత్రాలతో వేరే బ్యాంకులో తిరిగి లోన్ తీసుకోవడం పరిపాటిగా మారింది. గత కొద్దినెలల క్రితం వేరే బ్యాంకులో లోన్లు తీసుకున్న 8 గ్రూపులకు తిరిగి ఆటోనగర్ యూనియన్ బ్రాంచ్‌లో లోన్ ఇప్పించాలని ఆర్పీలు, సీఎంఎం ఆ బ్యాంక్ మేనేజర్‌ను కోరారు. దీనిపై సదరు బ్యాంకు మేనేజర్‌ను ఆర్పీలు, సీఎంఎం బురిడీ కొట్టించి ఆ 8 మంది గ్రూపు సభ్యులు ఎక్కడా బ్యాంకు రుణం తీసుకోలేదని తప్పుడు ధ్రువ పత్రాలు చూపించి రూ.కోటి ఐదు లక్షల వరకు రుణం మంజూరు చేయించుకున్నారు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఓ సీఎంఎం గుంటూరు తూర్పు నియోజకవర్గానికి వచ్చి మరి బ్యాంకును బురిడీ కొట్టించడం గమనార్హం. లోన్ రికవరీ జరగకపోవడంపై లోతుగా ఎంక్వయిరీ చేసిన మేనేజర్‌కు విస్తుపోయే నిజా లు తెలుసుకుని కంగుతిన్నాడు. ఆర్పీలు, సీఎంఎం తనను మోసం చేసి లోన్ తీసుకున్నారని మెప్మా కార్యాలయంలో పీడీ వెంకటనారాయణను కలిసి తన బాధను విన్నవించుకున్నారు.

మేలు చేయాలనే చూస్తే మోసం చేశారంటూ ఆవేదన...

ఆర్పీలు, సీఎంఎం కలిసి బురిడీ కొట్టించిన విషయంపై సదరు బ్యాంకు మేనేజర్ మెప్మా కార్యాలయంలో పీడీ వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారని సమాచారం. ఈ నెల 15వ తేదీ లోపు లోన్ రికవరీ చేయకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పినట్లు సమాచారం.

నలుగురికి మెమోలు..

బ్యాంకును మోసం చేసి రూ.1.05కోట్లు లోన్ తీసుకున్న విషయంలో ముగ్గురు ఆర్పీలు, సీఎంఎంలకు మెప్మా పీడీ వెంకటనారాయణ మెమోలు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీ లోపు లోన్ రికవరీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తీసుకున్న లోన్‌లో రూ.25లక్షలు చెల్లించినట్లు, మిగిలిన నగదు 15వ తేదీలోపు కట్టేటట్లుగా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

అక్రమాలు జరిగిన మాట వాస్తవమే...

తప్పుడు ధ్రువ పత్రాలతో యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను మోసం చేసిన ఆర్పీలు, సీఎంఎం రూ.1.5కోట్ల దాకా స్వాహా చేశారు. ఇందులో భాగస్వాములైన ముగ్గురు ఆర్పీలకు, ఒక సీఎంఎంకి మెమోలు జారీ చేశాం. ఈ నెల 15వ తేదీలోపు పూర్తిస్థాయిలో లోన్ రికవరీ చేయించకపోతే బ్యాంకు ద్వారా క్రిమినల్ కేసులు పెట్టించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– పి.వెంకటనారాయణ, మెప్మా పీడీ

ప్రాణదాత

- అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ
- ప్రమాదంలో గాయపడిన యువకుడు
- బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించిన వైద్యులు
- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు

తాడేపల్లిరూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. తాను తనువు చాలించినా మూడు కుటుంబాల్లో ఆనందాలు నింపాడు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన వల్లుపు శ్రీరాములు(23) సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమావశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీరాములుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో శ్రీరాములు భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీల అవయవ దానానికి


శ్రీరాములు (ఫైల్)

అంగీకరించారు. శ్రీరాములు కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని, మరొక కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం గుంటూరులోని వేదాంత హాస్పిటల్‌కు తరలించామని వైద్యులు తెలిపారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

గుంటూరు లీగల్: చెల్లని చెక్కు కేసులో ముద్దాయికి ఆర్నెల్లు సాధారణ జైలు శిక్ష, రూ.65 లక్షలు జరిమానా విధిస్తూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జి.స్పందన మంగళవారం తీర్పు చెప్పారు. జడ్జిమెంట్‌లో పేర్కొన్న వివరాలు.. హైదరాబాద్‌లోని శ్రీధాత్రి అగ్రి ఫారమ్స్‌లో భాగస్వామి అయిన మున్నంగి అప్పిరెడ్డి, గుంటూరుకు చెందిన యేరువ హనుమ రెడ్డి వద్ద వ్యాపారం నిమిత్తం రూ.65 లక్షలు అప్పు తీసుకున్నాడు. దీనికిగానూ రెండు ప్రామిసరీ నోట్లు రాశారు. అనంతరం అప్పు తీర్చేందుకు రూ.60 లక్షలకు ఒక చెక్కు, రూ.5 లక్షలకు మరో చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కులు రెండు చెల్లకపోవడంతో యేరువ హనుమ రెడ్డి కోర్టులో కేసు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

మెరిసిన ఫణి ఫ్రేమ్

- మోదుకూరు కుర్రోడికి ఫొటోగ్రఫీలో జాతీయ స్థాయి అవార్డు
- ఈనెల 7న హైదరాబాద్‌లో ప్రదానం
- '24 ఫ్రేమ్ ఫొటోగ్రఫీ'తో తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు


ఇండియన్ ఎమినెంట్ అవార్డు స్వీకరిస్తూ..

తెనాలి: సాంకేతిక నైపుణ్యం.. సృజనాత్మక దృష్టి.. రెండూ అవసరమైన కళ ఫొటోగ్రఫీ. క్షణకాలంలో ముప్పిరిగొనే భావోద్వేగాలను కెమెరా కన్నుతో ఒడిసిపట్టటం అంత ఈజీయేం కాదు. ఇంతటి క్లిష్టమైన ఫొటోగ్రఫీ కళలో అసాధారణ ప్రతిభ చూపారు ఫణి గోగిరెడ్డి. ఈయన తీసే ఫొటోల వరుస, కథను చెబుతాయన్న ప్రశంసలను అందుకున్నారు. ఫొటోగ్రఫీలో తన ప్రత్యేకతతో పలు అవార్డులను, ప్రశంసలను అందుకున్నారు. తాజాగా ప్రతిష్టాత్మక ఇండియన్ ఎమినెంట్ అవార్డు–2023ను స్వీకరించారు.

మూడు పదుల వయస్సులోనే గుర్తింపు

మూడు పదుల వయసులోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపును సాధించిన ఫణి గోగిరెడ్డి స్వస్థలం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చుండూరు మండలం మోదుకూరు. పాఠశాల విద్యనభ్యసిస్తున్నప్పుడే ఫొటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్న ఫణి కంప్యూటర్ సైన్స్‌లో డిప్లొమా తర్వాత ఫొటోగ్రఫీ కోర్సు చేశారు. ఆ తర్వాత సినిమా రంగంకేసి చూశారు. అసిస్టెంట్ కెమెరామెన్‌గా వృత్తి జీవితం ప్రారంభమైంది. 'ఎవడు', 'మిస్టర్ నూకయ్య', 'దేనికైనా రెడీ' తదితర పది సినిమాలకు పనిచేశారు. మూడున్నరేళ్ల ప్రముఖ సినీనటుడు, నిర్మాత మోహన్‌బాబు కంపెనీలో కొనసాగారు. ఆ తర్వాత సొంత కంపెనీతో మరో ప్రస్థానం ఆరంభించారు.

24 ఫ్రేమ్స్‌తో ఖ్యాతి

కట్ చేస్తే...24 ఫ్రేమ్స్.. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ప్రసిద్ధ ఫొటోగ్రఫీ సంస్థ ఇది.

ఫణి గోగిరెడ్డి సీఈఓగా 2016లో ప్రారంభమైంది. కథను చెప్పే క్షణాలను క్యాప్చర్ చేయగల వందకుపైగా అసాధారణమైన ఫొటోగ్రాఫర్లు/వీడియోగ్రాఫర్ల బృందంతో, అత్యద్భుతమైన పనితీరు, నిబద్ధత, కస్టమర్ల సంతృప్తితో ఆరేళ్ల కాలంలోనే ఈ కంపెనీ ఖ్యాతి ఇనుమడించింది. వెడ్డింగ్ షూట్స్, ప్రీ వెడ్డింగ్ షూట్స్‌లో సంస్థ అగ్రగామిగా నిలిచింది. ప్రతిష్టాత్మకమైన పారామౌంట్ కాన్సెప్ట్ ఇన్ ఫొటోగ్రఫీ, కస్టమర్ సపోర్ట్ అవార్డులను గెలుచుకుంది. గత రెండు, మూడేళ్లుగా ప్రసిద్ధ ఫొటోగ్రఫీ కంపెనీ నికాన్ ఇండియాకు అంబాసిడర్‌గా ఫణి వ్యవహరిస్తున్నారు.

తగిన గౌరవం

ఈ క్రమంలోనే వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు ఇన్నోవెక్సియా ఇంటర్నేషనల్ ఏటా ప్రదానం చేసే జాతీయస్థాయి 'ఇండియన్ ఎమినెంట్ అవార్డ్–2023'కు ఫణి గోగిరెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎ.మురళి, మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మి ఠాకూర్ చేతులమీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ప్రొఫెషనల్‌గా, తన క్రాఫ్ట్ పట్ల అచంచలమైన అంకితభావానికి ఈ అవార్డుతో తగిన గౌరవం లభించినట్టయింది.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి మార్గాలు అధికం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తోందని, అధికారులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశం మందిరంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరగా పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న లోపాలను, ఇబ్బందులను సరిచేయాలని సూచించారు. పదే పదే కార్యాలయాలకు తిప్పుకోవద్దని హెచ్చరించారు. రాయితీలను కూడా పారిశ్రామిక వేత్తలకు అవగాహన కలిగించాలని చెప్పారు. సింగిల్ డెస్క్ పోర్టల్స్ ఉన్న దరఖాస్తులు అధికారులు సమన్వయం చేసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాలో 45 పరిశ్రమలకు సంబంధించి 65 క్లెయిమ్స్‌కు రూ.7.60 కోట్లు మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ డీఎం విజయరత్నం, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏ రఘునాథ బాబు పాల్గొన్నారు.

రేపు ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో బుక్ ఎక్స్‌పర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్, అపెక్స్ సొల్యూషన్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్, హెటిరో డ్రగ్స్ వంటి 15 రకాల కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. అభ్యర్థుల విద్యార్హతలను బట్టి వేతనం రూ.ఎనిమిది వేల నుంచి రూ.40వేల వరకు ఉంటుందని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు ఉన్న 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. వివరాలకు వెంకట్ 95057 19172, రాజు 78937 89361తో పాటు టోల్ ఫ్రీ నంబరు 99888 53335లో సంప్రదించాలని తెలిపారు.

లక్ష్మీ మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలి

గుంటూరు ఈస్ట్: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి జిల్లాలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు బుధవారం ఏసీ కార్యాలయంలో ఈఓలతో సమావేశమయ్యారు. అనంతరం మహేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ, ధర్మాదాయ శాఖ అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞనం విజయవాడలో నిర్వహిస్తున్నారన్నారు.

రాష్ట్ర కాపు జేఏసీ లీగల్ సెల్ చైర్మన్‌గా సత్యనారాయణ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు, బలిజ, తెలగ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్‌గా సీహెచ్‌వీ సత్యనారాయణ(అడిషనల్ పీపీ)ను ఎన్నుకున్నారు. గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు అసోసియేషన్ జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనా



రాయణ మాట్లాడుతూ లీగల్ సెల్ చైర్మన్‌గా పేద వర్గాలకు ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

ఈ–స్టాంపింగ్‌తో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం

స్టాంపుల శాఖ డీఐజీ శ్రీనివాసరావు

గుంటూరు వెస్ట్: నాన్ జుడీషియల్ స్టాంపులు లేకపోయినా, బ్యాంకుల్లో చలాన్లు కట్టకపోయినా ఈ–స్టాంపింగ్ ద్వారా సులభంగా చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లతోపాటు నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత కూడా తీర్చుకోవచ్చని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ఈ–స్టాంపింగ్‌ను అవసరమున్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లు ఇలా ఎక్కడ అవసరమున్నా వీటిని ఉపయోగించుకోవచ్చని వివరించారు. నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్లకు సమాంతరంగా వీటిని వినియోగించుకోవాలని సూచించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ–స్టాంపింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే కొందరు వెండార్లకు లైసెన్సులు కూడా ఇచ్చామని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన డీఎస్పీలు


ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు

నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను బుధవారం పశ్చిమ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డి, తెనాలి డీఎస్పీ బి.జనార్ధన్‌రావు వేర్వేరుగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డీఎస్పీల బదిలీల్లో జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు వచ్చారు. ఈ క్రమంలో ఆయా సబ్ డివిజన్‌లకు డీఎస్పీలుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్పీని కలిసి మాట్లాడారు.

డీఎస్పీలు బాధ్యతల స్వీకారం

తెనాలి రూరల్: తెనాలి డీఎస్పీగా బి.జనార్ధనరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లాలో వివిధ స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది సీఐడీ విభాగంలో పని చేశారు. 2019లో డీఎస్పీగా ప్రమోషన్ రావడంతో ఏసీబీలో పనిచేశారు. తాజా బదిలీల్లో జనార్ధనరావును తెనాలికి కేటాయిస్తూ డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన డీఎస్పీకి తెనాలి వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, తెనాలి రూరల్, పొన్నూరు టౌన్, పొన్నూరు రూరల్ సీఐలు కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు, యు. శ్రీరాములు, కె. శ్రీనివాసరెడ్డి, బాబి, పి. ప్రభాకరరావు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు డీఎస్పీకి స్వాగతం పలికారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పోలీసు శాఖ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

వెస్ట్ డీఎస్పీగా ఉమామహేశ్వరరెడ్డి..

గుంటూరు ఈస్ట్: గుంటూరు వెస్ట్ డివిజన్ డీఎస్పీగా బి.ఉమామహేశ్వరరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సత్యసాయి జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. 1995లో ఎస్ఐగా విధుల్లో చేరిన ఉమామహేశ్వరరెడ్డి అనంతపురంలో విధులు నిర్వహించారు. 2007లో సీఐగా పదోన్నతిపై కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతిపై గుంతకల్లు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో విధులు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ విజిబుల్ పోలిసింగ్ సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

మంగళగిరి: జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చంపియన్‌షిప్–2023 పోటీలకు జిల్లా క్రీడాకారుల జట్టును ఎంపిక చేసినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని నిబెస్ కాశీ పట్టణంలో ఈనెల 12వ తేదీ నుంచి 17 వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పురుషుల సబ్ జూనియర్ 59 కేజీల విభాగంలో జి.హేమవర్ధన్, 83 కేజీల విభాగంలో జి.నాగ గణేష్, జూనియర్స్ 59 కేజీల విభాగంలో పి.భరత్‌కుమార్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహిళల సబ్ జూనియర్స్ 43 కేజీల విభాగంలో ఎం.షామాన్, 84 కేజీల విభాగంలో షేక్ షబీనా, జూనియర్స్ 57 కేజీల విభాగంలో షేక్ సాదియా ఆల్మస్, 63 కేజీల విభాగంలో షేక్ ఆసియా, 76 కేజీల విభాగంలో టి.నాగజ్యోతిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎస్‌కే సంధానీ, ఎండీ ఖమురుద్దీన్ పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

ఉద్యోగాలకు ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నేడు

గుంటూరు మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ కింద వైద్య ఉద్యోగాలకు ఎంపికైన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు బుధవారం తెలిపారు. డెంటల్ టెక్నీషియన్, సోషల్‌వర్కర్, సైకాలజిస్టు, మల్టీహ్యాబిలిటేషన్ వర్కర్, ఆడియో మెట్రిషియన్, న్యూట్రీషియన్ కౌన్సిలర్, స్టాఫ్‌నర్సు, హాస్పిటల్ అటెండెంట్, శానిటరీ అటెండెంట్, క్లీనర్, అటెండెంటర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టు ఆధారంగా గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫైనల్ మెరిట్ లిస్టు ఆధారంగా 1:3 మెరిట్ కమ్ రూరల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు వివరించారు. అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, ఉద్యోగాలకు ఎంపికైన వారందరూ ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

పేద ఇక రాజాగా


యర్రబాలెం లే అవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృశ్యం

సీఆర్డీఏ పరిధిలోని ఆర్–5 జోన్‌లో పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన భూముల్లో లే అవుట్ల అభివృద్ధి పనులు చకచక సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొంత అవరోధం కలిగినా తాజాగా రెండు రోజులుగా కాస్తున్న ఎండలతో మళ్లీ పనులు ఊపందుకున్నాయి. ఫలితంగా నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెంలోని సుమారు 550 ఎకరాల్లో 23వేల మంది పేదలకు స్థలాలు కేటాయించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 17వ తేదీ నాటికి లే అవుట్లలో అన్ని పనులూ పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

– మంగళగిరి


కృష్ణాయపాలెం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు